క్లుప్తంగా

కల్యాణం .. కమనీయం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం


కళాశాల ప్రిన్సిపాల్ శంకర్

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ శుక్రవారం తెలిపారు.అర్థశాస్త్రం సబ్జెక్టు ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై నెట్/స్లెట్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు విద్యా అర్హత, బోధన అనుభవానికి సంబంధించి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు జెరాక్స్ సెట్‌తో డెమో క్లాస్ నిర్వహించడానికి ఈ నెల 20న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు.

కల్యాణ మండపం పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న అన్నంరెడ్డి శిరీష

సింహాచలం: పెందుర్తి మండలం రాంపురంలో నిర్మిస్తున్న మినీ కల్యాణ మండపం పనులను సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష పరిశీలించారు. శరవేగంగా పనులు చేసి కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆమె సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ లైన్ మార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నంరెడ్డి శ్రీరాములు, కొత్తలంక సైమన్, కొత్తలంక అప్పారావు, ఇందుగుబిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పురుషోత్తపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరిపురపు శ్రీనివాసరావు సొంత నిధులతో స్టడీ మెటీరియల్ శుక్రవారం అందజేశారు. విద్యార్థులంతా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిరికి శ్రీనివాసరావు, పార్థసారథి, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

'ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య'

విశాఖ విద్య: ఆర్జేడీ ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య అని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. గోపీనాథ్, ఎం. శ్రీను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులు సరైన పద్ధతి కాదన్నారు. విద్యాశాఖ పనితీరు పురోగతికి ఆర్జేడీ ప్రతాపరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అలాంటి అధికారికి పీఆర్‌టీయూ అండగా నిలుస్తుందన్నారు.

పరమశివా.. పాహిమాం

- మహా శివరాత్రి పూజలకు సర్వం సిద్ధం
- ముస్తాబైన శైవక్షేత్రాలు


రామలింగేశ్వరస్వామి ఆలయం


దేవీపురంలో ముస్తాబైన కామాఖ్యపీఠం


సుజాతానగర్‌లోని పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి


సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి


పరవాడ ఆలయంలోని శివలింగం

సింహాచలం: మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం విశేష పూజలు నిర్వహించడానికి పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు, ఆలయాల నిర్వహణ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు.

- సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో శైవాగమం ప్రకారం మహాశివరాత్రి పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజామున 4 గంటలకు రుద్రాభిషేకం, తదుపరి సాయంత్రం వరకు స్వామికి అభిషేకాలు, రాత్రి 12 గంటలకు లింగోద్భవపూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు సుబ్బారావుశర్మ తెలిపారు.
- 98వ వార్డు పరిధిలోని సింహపురికాలనీలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో విశేషంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉదయం 9.30గంటలకు ఏకవారాభిషేకాలతో పూజలు ప్రారంభించి రాత్రి 12గంటల నుంచి లింగోద్భవ పూజలు నిర్వహించనున్నారు.
- పాత అడవివరం, కాపుదిబ్బ, విజినిగిరిపాలెం, ప్రియాగార్డెన్స్‌లోని శివాలయాల్లో పరమేశ్వరుడికి విశేషంగా పూజలు నిర్వహించేరుకు ఆయా ఆలయాల అర్చకులు ఏర్పాట్లు చేశారు.
- 93వవార్డు ప్రహ్లాదపురంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని విశేషంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 3నుంచి 4గంటల వరకు అభిషేకం, నాలుగు గంటల నుంచి శనేశ్వరస్వామికి తైలాభిషేకం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ పూజలు నిర్వహించనున్నారు.

పెందుర్తిలో...

97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, వెంకటాద్రి ఘాట్‌రోడ్డులోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, పినగాడిలోని చోడేశ్వరస్వామి ఆలయం, సుజాతానగర్‌లోని కేదారేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పూజలకు ఏర్పాట్లు చేశారు. అలాగే ప్రశాంతినగర్‌లోని స్వయంభూ మల్లేశ్వరస్వామి, సరిపల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయం, వేపగుంటలోని ఈశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని విశేషంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

పరవాడ మండలంలో..


ముస్తాబైన లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వరస్వామి ఆలయం

పరవాడ: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని తాడి,పరవాడ, ముత్యాలమ్మపాలెంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. తీరంలో మహిళా భక్తులు దుస్తులు మార్చుకోవడానికి వీలుగా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు.

శివాలయాలు ముస్తాబు

సబ్బవరం:మండలంలోని పలు శైవ క్షేత్రాలు మహాశివరాత్రి పర్వదిన పూజలకు సిద్ధమయ్యాయి. లింగాలతిరుగుడులోని స్వయంభూ సోమలింగేశ్వరస్వామి ఆలయం,పెదయాతపాలెంలోని ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీ పరమేశ్వరుల క్షేత్రం, ఇరువాడలోని స్వయంభూ భీమలింగేశ్వరస్వామి ఆలయం,వంగలిలోని స్వయంభూ సోమలింగేశ్వరస్వామి ఆలయం,సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం,దేవీపురం దక్షవాటిలోని పంచభూత లింగేశ్వరస్వామి ఆలయాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. జాగరణ ఉండే భక్తుల కోసం తీరంలో గరివిడి లక్ష్మి బుర్రకథ, రేలారేరేలా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం నుంచి బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ ఈశ్వరరావు తెలిపారు.

- ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీ పరమేశ్వరుల ఆలయంలో శనివారం ఉదయం 5 గంటల నుంచి అభిషేకాలు,రుద్రాభిషేకాలు,దూప దీప నైవేద్యాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం శివపార్వతుల కల్యాణం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శరగడం శంకరరావు తెలిపారు.


పెదయాతపాలెంలోని ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీ పరమేశ్వరులు


పరవాడలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయం

- దేవీపురంలోని దక్షవాటిలో పంచభూత లింగేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకుడు ప్రభాకర్ తెలిపారు. అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించిన కేంద్ర బృందం


బాటజంగాలపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

సబ్బవరం: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృంద సభ్యులు బాటజంగాలపాలెం గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శుక్రవారం సందర్శించారు. ప్రధానమంత్రి ఎక్స్‌లెన్స్ అవార్డుల్లో భాగంగా దేశంలోని కొన్ని జిల్లాలను గుర్తించి ఆయా జిల్లాల్లో క్షేత్ర పరిశీలన చేసి ప్రజలకు అందుతున్న పలు రకాల వైద్య సేవలతో పాటు ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకోనున్నారు. దీనిలో భాగంగా అనకాపల్లి జిల్లాలోని సబ్బవరం మండలం బాటజంగాలపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను క్షేత్ర పరిశీలన చేశారు. గ్రామస్తులను బృందం సభ్యులు అందుతున్న పలు రకాల వైద్య సేవలు,మందులు,రోగులకు చేస్తున్న మెడికల్ టెస్టులు వంటి పలు రకాల ప్రశ్నలు అడిగి వారి సంతృప్తి స్థాయిని తెలుసుకున్నారు. వారి వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ. హేమంత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, డీఎల్‌వో శారదా బాయ్,సబ్బవరం మెడికల్ ఆఫీసర్ ఎస్ చక్రవర్తి, విజయ,వైద్య సిబ్బంది శాంతి,భవాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో సరస్వతి పూజ


వేదికపై సరస్వతిపూజ చేస్తున్న పండితులు, పాల్గొన్న ఉపాధ్యాయులు

సింహాచలం: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం పదోతరగతి సీబీఎస్‌ఈ విద్యార్థులతో సామూహిక సరస్వతీపూజ నిర్వహించారు. చదువులతల్లికి హారతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప చంద్రకళ మాట్లాడుతూ సరస్వతీదేవి కటాక్షంతో ప్రతీ విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల జీఎం రమ్య, వంశీకృష్ణ, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక


మెట్టపాలెం వసతి గృహంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

పరవాడ: వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక సమర్పిస్తామని మండల ప్రత్యేక అధికారి ఎర్రన్నాయుడు చెప్పారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి ఆదేశాల మేరకు మండలంలోని వాడచీపురుపల్లి, మెట్టపాలెం, పరవాడ, లంకెలపాలెం, తానాం గ్రామాల్లోని బీసీ, ఎస్సీ బాల బాలికల వసతి గృహాలను సందర్శించారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు, అమలు జరుగుతున్న మెనూ, తాగునీరు, వాటర్ సప్లై,టాయిలెట్స్, లివింగ్ రూముల స్థితిగతులను పరిశీలించామన్నారు. వాడచీపురుపల్లి, మెట్టపాలెం వసతి గృహాలు మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. తానాం రెసిడెన్షియల్ వసతి గృహంలో బాలికలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. పరవాడ, లంకెలపాలెం వసతి గృహాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక సమర్పిస్తామని మండల ప్రత్యేక అధికారి ఎర్రనాయుడు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఎంఈవో ఎం.సునీత, వసతి గృహ అధికారులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


చినముషిడివాడలో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ అశోక్, ఎస్‌ఐ రమేష్

సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం సాగించాలని పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ వాహనదారులు, ప్రజలకు సూచించారు. చినముషిడివాడ సంత వద్ద శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు సుప్ర వెహికల్ ద్వారా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే తీరు, గతంలో జరిగిన ప్రమాదాల సంఘటనలను స్క్రీన్‌పై చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని తెలియజేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయడం ద్వారా సంభవించే ప్రమాదాలను వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.

విశేషంగా తిరువీధి


తిరువీధిలో అమ్మవార్లు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం సింహవల్లీ తాయారు అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మారికి తిరువీధి విశేషంగా జరిగింది. అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిలో అధిష్టంపజేశారు. ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు.

చురుగ్గా రక్షిత మంచినీటి పథకం పనులు


మంచినీటి పథకం పనులు పరిశీస్తున్న నాయకులు

పరవాడ: జీవీఎంసీ 84 వార్డు సాలాపువానిపాలెంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంజూరు చేసిన రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సాలాపు సంతోష్ చెప్పారు. గ్రామంలో ఆరు వేల లీటర్ల కెపాసిటీ కలిగిన మంచినీటి పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆ పనులను సంతోష్ శుక్రవారం పరిశీలించారు. మంచినీటి పథకానికి నీరందించడానికి అవసరమైన మంచినీటి బోరువెల్ త్వరలో ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ట్యాంకు నిర్మాణ వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, అప్పలరాజు, సాలాపు రాజు, రామకృష్ణ, నూకరాజు, కృష్ణ, పరదేశి, సతీష్, అప్పారావు, పైడినాయుడు, దొరబాబు ఉన్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రపంచ మానవ హక్కుల సమితి ప్రతినిధులు

ఆరిలోవ : మానవ హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ప్రపంచ మానవ హక్కుల సమితి (డబ్ల్యూహెచ్‌ఆర్‌సీ) జాతీయ చైర్మన్ ఆర్.బాలాజీ సూచించారు. ఆరిలోవ ప్రాంతం హెల్త్ సిటీలోని ఓ హోటల్‌లో మానవ హక్కుల ప్రతినిధుల రాష్ట్ర సమావేశం శుక్రవారం నిర్వహించారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అవగాహన సదస్సులపై చర్చించారు. అనంతరం సమితి కార్యాచరణతో కూడిన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి అంశంపైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలలు, వృద్ధులు, మహిళలు తమకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడానికి ముందుకు రావాలని సూచించారు. సమాజంలో వివక్ష పెరిగిపోతోందని, దాని నుంచి బయటపడడానికి ప్రయత్నించాలన్నారు. యువతలో అవగాహన కలిగించడానికి విద్యార్థులకు కళాశాలల్లో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో విశాఖలోనే మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలిపారు. జాతీయ జనరల్ సెక్రటరీ మధుబాబు, సమితి రాష్ట్ర విభాగం చైర్మన్ బి.కార్తీక్ రామ్, పి.ఎస్.ఆచారి పాల్గొన్నారు.

ఘనంగా మృత్యుంజయ రుద్ర హవనం

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు సింహపురికాలనీలోని సీతారామాలయ ఉపాలయాల 20వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం మృత్యుంజయ రుద్ర హవనం విశేషంగా నిర్వహించారు. ఆరోగ్యప్రాప్తి, సర్వగ్రహదోష నివారణ, శివానుగ్రహ సిద్ధికి ఈహోమాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతి నిర్వహించిన అనంతరం భక్తులకు యజ్ఞప్రసాదం అందజేశారు.

వాల్తేర్ డివిజన్‌లో రైల్వే జీఎం తనిఖీలు


డివిజన్ కార్యకలాపాలు, పనితీరును పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీఎం మనోజ్ శర్మకు వివరిస్తున్న డీఆర్‌ఎం సత్పతి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా మనోజ్ శర్మ వాల్తేర్ డివిజన్ పరిధి పలాస-విశాఖపట్నం సెక్షన్‌లో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి శుక్రవారం విండో ఇన్‌స్పెక్షన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పలాస-విశాఖపట్నం సెక్షన్‌లోని ట్రాక్స్, మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్, సిగ్నలింగ్, పలు భద్రతా విషయాలను పరిశీలించారు. జీఎం, డీఆర్‌ఎంలతోపాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన వివిధ విభాగాల ప్రిన్సిపల్ హెడ్స్, వాల్తేర్ డివిజన్‌కు చెందిన బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

వివిధ విభాగాధిపతులతో సమావేశం..

జీఎం మనోజ్ శర్మ విశాఖ చేరుకున్న తరువాత డీఆర్‌ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, డివిజన్ పనితీరు, అవలంబిస్తున్న భద్రతా ప్రమాణాలు, అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీఎంకు డీఆర్‌ఎం సత్పతి వివరించారు. యూనియన్ నాయకులు డీఆర్‌ఎం కార్యాలయంలో మనోజ్ శర్మకు స్వాగతం పలికారు.

మానసిక ప్రశాంతతతో లక్ష్య సాధన

ఏయూ క్యాంపస్: మనిషికి మానసిక ప్రశాంతత ఉంటే లక్ష్య సాధన సులభమవుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సహజ యోగ ప్రదాత మాతాజీ నిర్మలాదేవి శత జయంత్యుత్సవాలు శుక్రవారం ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను వీసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో ప్రజలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. ఒత్తిళ్లను జయించేందుకు ప్రతి ఒక్కరు యోగా సాధన, ప్రాణాయామం చేయాలని సూచించారు. ఇటువంటి ఒత్తిడి లేని నాడే మానవుడు అనుకున్నది అత్యంత సులభంగా సాధించగలడని తెలిపారు. ఏయూ యోగా కేంద్రంలో ఎంఏ యోగా విద్యార్థులకు సహజ యోగాపై అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు.

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని వయస్సుల వారికి సహజ యోగా ఒక మానసిక శక్తిని అందించే సాధనంగా మారిందన్నారు. మాతాజీ నిర్మలాదేవి ప్రసాదించిన సహజ యోగ ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చునని చెప్పారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, సీనియర్ జర్నలిస్ట్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ నిరంతరం సహజ యోగా చేయడం వల్ల ఒత్తిళ్లు దరి చేరవని తెలిపారు. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో వివిధ రాష్ట్రాల నుంచి సహజ యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు రమేష్, సోంబాబు, కె.వెంకటరెడ్డి, రోహిణి పాల్గొన్నారు.

వైభవంగా సాగిన శోభాయాత్ర

మూడు రోజుల పాటు జరగనున్న నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శోభాయాత్ర వైభవంగా సాగింది. మాతాజీ నిర్మలాదేవి చిత్రపటాన్ని రథంపై ఉంచి శోభాయాత్ర చేపట్టారు. పార్క్ హోటల్ వద్ద ప్రారంభమైన శోభాయాత్ర సిరిపురం మీదుగా ఏయూ కాన్వొకేషన్ హాల్ వరకు సాగింది.

మార్చి 10 నుంచి కళాకారుల క్రికెట్ టోర్నమెంట్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి తదితరులు

అల్లిపురం: విశాఖపట్నం కళాకారుల క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్‌ను మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జీవీఎంసీలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాకారుల సంఘం అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ జ్ఞానాపురం గోల్డెన్ జూబ్లీ స్కూల్‌లో మార్చి 10 నుంచి 12వ తేదీ వరకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, విష్ణు పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ యాదవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

ఏయూ క్యాంపస్: శాంతి, అహింస, కరుణ భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. శుక్రవారం ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేసిన గాంధీజీ జీవిత సంగ్రహ ఫొటో గ్యాలరీని ఆయన ప్రారంభించారు. గాంధేయవాది రావిప్రోలు సుబ్రహ్మణ్యం,ఆచార్య చల్లా రామకృష్ణ పాల్గొన్నారు.